స్పామ్ కాల్స్, మెసేజ్‌లకు చెక్

న్యూఢిల్లీ, నవంబర్ 26: పనిలో ఉన్నప్పుడో.. ప్రయాణం చేస్తున్నప్పుడో.. లేక విశ్రాంతి తీసుకుంటున్నప్పుడో కొంపలు మునిగిపోతున్నట్టు కాల్స్ వస్తూంటాయి. తీరా ఫోన్ ఎత్తి మాట్లాడితే.. అక్కడ ఆ ప్లాట్, ఇక్కడ ఈ క్రెడిట్ కార్డ్ ఆఫర్ అంటూ రకరకాల అడ్వర్టైజ్‌మెంట్లు. ఇక ఇన్‌బాక్స్ నిండిపోయేలా ఎస్ఎంఎస్‌ల సంగతి సరేసరి. ఆ ఫోన్ కాల్స్‌ను ఎత్తలేక, ఈ మెసేజ్‌లను డిలీట్ చేయలేక మొబైల్ ఫోన్ యూజర్లు సతమతమైపోతున్నారంటే అతిశయోక్తి కాదు. మనలో చాలామందిదీ ఇదే పరిస్థితి.

ఇదీ సంగతి..

అవాంఛిత మొబైల్ ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయాయి. అయితే కొత్తగా వస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్‌లు ఈ సమస్య నుంచి మనల్ని బయటపడేస్తాయనుకుంటే పొరబాటే. ఎందుకంటే సైబర్ క్రిమినల్స్ ఈ టెక్నాలజీలనే వాడుతున్నారిప్పుడు. రోబోకాల్ వంటి టెక్నిక్స్‌ను ఉపయోగించి మొబైల్ ఫోన్ యూజర్లకు స్పామ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లను చేస్తున్నారు మరి.

ఏం చేయాలి?

నిజానికి గత కొన్నేండ్లుగా టెలికం రెగ్యులేటర్ ట్రాయ్.. మొబైల్ ఫోన్ వినియోగదారులను ఎంతగానో విసిగిస్తున్న ఈ అవాంఛిత కాల్స్, మెసేజ్‌లకు అడ్డుకట్ట వేయాలని తీవ్రంగానే శ్రమిస్తున్నది. ఈ క్రమంలో వచ్చినదే 'డు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ)' సదుపాయం. మీ మొబైల్ నెంబర్‌కు డీఎన్‌డీని యాక్టివేట్ చేయడం ద్వారా స్పామ్ కాల్స్, మెసేజ్‌ల సమస్య నుంచి బయటపడవచ్చు. అయితే కొన్ని మొబైల్ ఫోన్స్‌లో మెసేజ్ యాప్‌లోనే వద్దనుకున్న మెసేజ్‌ను మార్క్‌చేసి వాటిని ఆపేసుకోవచ్చు.

డీఎన్‌డీ యాక్టివేట్ ఎలా?

ఎయిర్‌టెల్ కస్టమర్లు

- ఎయిర్‌టెల్ డీఎన్‌డీ వెబ్‌సైట్‌కు వెళ్లాలి.
- కిందనున్న రెడ్ కలర్ సెక్షన్‌లో 'క్లిక్ హియర్'పై క్లిక్ చేయాలి.
- అక్కడ తెరుచుకునే బాక్స్‌లో మీ మొబైల్ నెంబర్‌ను టైప్ చేయాలి.
- వచ్చే ఓటీపీతో కొత్త స్క్రీన్‌లోకి వెళ్లి 'స్టాప్ ఆల్'ను ఎంచుకోవాలి. లేదా 1909కు 'START 0' అని మెసేజ్ పెట్టినా డీఎన్‌డీ అవుతుంది.

జియో కస్టమర్లు

- మైజియో యాప్‌కు వెళ్లాలి.
- అక్కడ మోర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఆ తర్వాత 'డు నాట్ డిస్టర్బ్'పై క్లిక్ చేయాలి.
- 'సెట్ ప్రిఫరెన్స్'ను ఎంచుకోవాలి.
- పుల్లి బ్లాక్డ్‌ను ఎంచుకొంటే అన్నీ ఆగిపోతాయి.
- అయితే బ్యాంక్ లావాదేవీ సంబంధిత మెసేజ్‌లు, ప్రభుత్వ ఏజెన్సీల సందేశాలు ఆగవు.

వీఐ కస్టమర్లు

- మైవీఐ.ఇన్/డీఎన్‌డీ వెబ్‌సైట్‌కు వెళ్లాలి.
- అక్కడ మీ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి. సెండ్ ఓటీపీపై క్లిక్ చేయాలి.
- ఓటీపీని ఎంటర్ చేసి వెరిఫైపై క్లిక్ చేయాలి.
- ఫుల్, పార్షియల్ డీఎన్‌డీ లేదా బ్లాక్ ప్రమోషన్స్‌లో ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.



భారీగా తగ్గిన బంగారం ధర

2 రోజుల్లో తులం రూ.2,400 డౌన్ • హైదరాబాద్‌లో రూ.77,240

హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబర్ 26: దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. ఆ మధ్య ఆల్ టైమ్ హై రికార్డులతో హోరెత్తించినా.. ఆ తర్వాత వరుసగా క్షీణించాయి. కానీ తిరిగి పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. ఇప్పుడు పతనం దిశగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ బంగారం ధర ఏకంగా రూ.1,310 పడిపోయింది. రూ.77,240 వద్ద స్థిరపడింది. సోమవారం కూడా రూ.1,090 కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక 22 క్యారెట్ రేటు ఈ ఒక్కరోజే రూ.1,200 తగ్గి 10 గ్రాములు రూ.70,800 వద్ద నిలిచింది. అంతకుముందు రోజు రూ.1,000 పడిపోయింది. దేశ రాజధాని ఢిల్లీలో తులం పసిడి విలువ రూ.1,250 క్షీణించి రూ.78,150 పలుకుతున్నది. సోమవారం రూ.1,000 తగ్గిన సంగతి విదితమే. అలాగే కిలో వెండి ధర రూ.1,100 తగ్గి రూ.90,600లుగా ఉన్నది. మునుపటి రోజు రూ.1,600 పడిపోయింది. కరెన్సీ మార్కెట్‌లో డాలర్ బలోపేతం.. గ్లోబల్ గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నది.

శశి రుయా కన్నుమూత

న్యూఢిల్లీ, నవంబర్ 26: బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగ సంస్థ ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపకుల్లో ఒకరైన శశికాంత్ రుయా కన్నుమూశారు. ఆయన వయసు 80 ఏండ్లు. అనారోగ్య సమస్యలతో సోమవారం అర్ధరాత్రి ముంబైలో మరణించినట్టు రుయా కుటుంబం ఓ ప్రకటనలో మంగళవారం తెలియజేసింది. తన సోదరుడు రవి రుయాతో కలిసి 1969లో ఎస్సార్‌ను శశి రుయా ప్రారంభించారు.

ఓలా ఎలక్ట్రిక్ మంగళవారం గిగ్, గిగ్‌ప్లస్ పేరిట కమర్షియల్ స్కూటర్లను తెచ్చింది. ఎక్స్‌షోరూం ధరల శ్రేణి రూ.39,999-49,999. సింగిల్ చార్జింగ్‌పై 112 కిమీ దాకా వెళ్లగలవు. ఎస్1 జెడ్, జెడ్‌ప్లస్ మోడళ్లనూ ఆవిష్కరించింది. ధరల శ్రేణి రూ.59,999-64,999.

బయోసిమిలర్స్ ఉత్పత్తిలో తెలంగాణ భేష్

మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): టీకాలు, జనరిక్ ఔషధాల తోపాటు క్యాన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమైన బయోసిమిలర్స్ ఉత్పత్తిలో ప్రపంచ గమ్యస్థానంగా తెలంగాణ వృద్ధి చెందిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు వేసే దిశగా ప్రస్థానం కొనసాగుతోందని తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఇండో-బెల్జియం లైఫ్ సైన్సెస్ సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 33% వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు తెలంగాణ నుంచే సరఫరా అవుతున్నాయన్నారు. కొత్త అవకాశాలతో బెల్జియం కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి 24-26 మధ్య హైదరాబాద్‌లో జరగనున్న బయో ఏషియా సదస్సులో ఇక్కడికి వచ్చిన ప్రముఖులంతా పాల్గొనాలని కోరారు. ఈ సదస్సుకు బెల్జియం రాయబారి డిడియర్ వాండర్హాసెల్ట్, డాక్టర్ రెడ్డీస్ ఎండీ జీ.వీ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

అదానీకి రేటింగ్స్ దెబ్బ

అమెరికా కేసు నేపథ్యంలో ఏడు సంస్థలకు మూడీస్ నెగెటివ్ ఔట్‌లుక్

పలు అదానీ బాండ్లను ప్రతికూలంలో పెట్టిన ఫిచ్

న్యూఢిల్లీ, నవంబర్ 26: అమెరికా లంచం కేసులో గౌతమ్ అదానీ ఇరుక్కోవడం.. అదానీ గ్రూప్‌నకు రకరకాల సమస్యల్ని తెచ్చిపెడుతున్నది. ఇప్పటికే ఆయా కంపెనీల షేర్ల విలువ దేశీయ స్టాక్ మార్కెట్‌లో పడిపోతుండగా, విదేశీ మదుపరులు పెట్టుబడులకు దూరం జరుగుతున్నారు. తాజాగా ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలైన మూడీస్, ఫిచ్‌ల సెగ కూడా అదానీకి తగిలింది. అదానీ గ్రూప్‌లోని ఏడు సంస్థల రేటింగ్ ఔట్‌లుక్‌ను 'స్టేబుల్' నుంచి 'నెగెటివ్'లోకి దిగజార్చినట్టు మంగళవారం మూడీస్ ప్రకటించింది. వీటిలో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్, రెండు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విభాగాలు, అదానీ ట్రాన్స్‌మిషన్ స్టెప్ వన్ లిమిటెడ్, అదానీ ట్రాన్స్‌పోర్టేషన్ రెస్ట్రిక్టెడ్ గ్రూప్ 1, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్, అదానీ ఇంటర్నేషనల్ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలున్నాయి. మరోవైపు అదానీ ఎనర్జీ, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై బాండ్లను నెగెటివ్ మోడ్‌లో పెట్టి నట్టు ఫిచ్ రేటింగ్స్ స్పష్టం చేసింది. దీంతో ఆయా సంస్థల్లోకి పెట్టుబడులు, బాండ్ల క్రయవిక్రయాలు రిస్క్‌లో పడ్డట్టైంది.



టోటల్‌ఎనర్జీస్‌పై..

ఫ్రాన్స్‌కు చెందిన ఇంధన దిగ్గజం టోటల్‌ఎనర్జీస్.. అదానీ గ్రూప్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టబోమంటూ చేసిన ప్రకటనపై గ్రూప్ సంస్థ స్పందించింది. మా కార్యకలాపాలపై ఈ నిర్ణయం ఏ రకమైన ప్రభావం చూపబోదంటూ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పేర్కొన్నది.

నష్టాల్లో స్టాక్స్

మంగళవారం స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో వివిధ అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువ గరిష్ఠంగా 7 శాతానికిపైగా పడిపోయింది. బీఎస్ఈలో అదానీ గ్రీన్ ఎనర్జీ 7.05 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 4.78 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 3.79 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 3.50 శాతం, అదానీ పోర్ట్స్ 3.23 శాతం, అదానీ విల్మర్ 2.44 శాతం, అంబుజా సిమెంట్స్ 2.30 శాతం, అదానీ పవర్ 2.04 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 1.91 శాతం, ఏసీసీ 1.37 శాతం, ఎన్టీటీవీ 0.09 శాతం మేరకు దిగజారాయి. ఇక బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 105.79 పాయింట్లు క్షీణించి 80,004.06 వద్ద, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 27.41 పాయింట్లు కోల్పోయి 24,194.50 వద్ద నిలిచాయి.

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ఇబ్బందులు

డిచ్‌పల్లి, నవంబర్ 26: ప్రజల కష్టాలను గమనించి డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు. ఎంపీ అర్వింద్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇందుకోసం కృషి చేయాలని పేర్కొంటున్నారు. ఎంపీ అర్వింద్ డిచ్‌పల్లిలో ఫూట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎన్నికల ముందు హామీ ఇచ్చి మరిచిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం విద్యార్థులు, దవాఖానకు రోగులు, ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వస్తుంటారని తెలిపారు. వారు రైలు కింది నుంచి దూరి రావడంతో పలు మార్లు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా మెట్ల వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు కింది నుంచి వెళ్తున్న విద్యార్థులు, మహిళలు

రైతులకు చెల్లింపులు వెంటనే చేపట్టాలి

ధాన్యం సేకరణపై సీఎం వీడియో కాన్ఫరెన్స్

వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

కంఠేశ్వర్, నవంబర్ 26: జిల్లాల్లో ధాన్యం సేకరణ, బిల్లుల చెల్లింపు తదితర విషయాలపై సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, చెల్లింపులను వెంటనే చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 30వ తేదీన మహబూబ్‌నగర్‌లో రైతు పండుగను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు సీఎస్ శాంతికుమారితో కలిసి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ ధాన్యం కొనుగోళ్ల ప్రగతిని నివేదించగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ బ్రోకర్లను సస్పెండ్ చేయాలి

మాట్లాడుతున్న శ్రీనివాస్ మాదిగ

ఖలీల్‌వాడి, నవంబర్ 26: ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌లోని రాజకీయ బ్రోకర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ, మాలలను రెచ్చగొడుతున్న జి.వివేక్ వెంకటస్వామి, మల్లు రవి, కేఆర్ నాగరాజు లాంటి వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలను తీసుకోవాలని కోరారు. డిసెంబర్ ఒకటో తేదీన వర్గీకరణ వ్యతిరేక మాలల సింహగర్జనపై మాల, మాదిగల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో మొదటి అంశంగా వర్గీకరణను చేర్చి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చేవెళ్ల డిక్లరేషన్‌లో వర్గీకరణ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. అయినా కొందరు వారి స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మిగిలిన సీట్లు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయాలి

డిచ్‌పల్లి, నవంబర్ 26: తెలంగాణ యూనివర్సిటీలో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తర్ల లక్ష్మణ్, రెంజర్ల రాములు డిమాండ్ చేశారు. మంగళవారం క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ విషయమై వర్సిటీ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్పాట్ కౌన్సిలింగ్‌కు వీసీ సానుకూలంగా ఉన్నప్పటికీ కొందరు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు అరుణ్, బంతీలాల్, అభిలాష్, సురేశ్ పాల్గొన్నారు.

లైబ్రరీలో చదివి ఉద్యోగం సాధించడం అభినందనీయం

అనూషను సన్మానిస్తున్న జిల్లా చైర్మన్ రాజిరెడ్డి

ఖలీల్‌వాడి, నవంబర్ 26: గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి అన్నారు. మోర్తాడ్ మండలం దొన్‌పాల్‌కు చెందిన పర్స అనూష రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించింది. దీంతో గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డి ఆమెకు మంగళవారం శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నరేశ్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

నందిపేట్ కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

నందిపేట్, నవంబర్ 26: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అయిలాపూర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంగళవారం అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారం, నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డెన్లు ప్రత్యేకాధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సొంత పిల్లలా విద్యార్థుల బాగోగులను చూసుకోవాలని సూచించారు. భోజనం సరిగ్గా లేకపోతే విద్యార్థులు నేరుగా అధికారులు, లేదా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నాణ్యమైన భోజనం వడ్డించక పోతే భోజన ఏజెన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి జగన్నాథచారి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి

భీమ్‌గల్, నవంబర్ 25: బీసీ బాలుర హాస్టల్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్, వంటగదిని పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. పప్పులు, కూరగాయలు, బియ్యం, ఇతర సరుకులు ఉండే రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డు ఆఫీసర్ నవీన్, ఓంకార్, రాజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆర్మూర్‌టౌన్, నవంబర్26: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (చీమన్‌పల్లి) పాఠశాలను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు.

ఇంటర్ ఫీజు గడువు పెంపు

ఖలీల్‌వాడి, నవంబర్ 26: ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును డిసెంబర్ 3వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ అన్ని గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు విద్యార్థుల నుంచి అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 3 వరకు పరీక్ష ఫీజు తీసుకోవాలని పేర్కొన్నారు. రూ.100 అపరాధ రుసుముతో డిసెంబర్ 4 నుంచి 10వ తేదీ వరకు, రూ.500 అలస్య రుసుముతో 11 నుంచి 17వ తేదీ వరకు, రూ.వెయ్యి అపరాధ రుసుముతో 18 నుంచి 24వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు..

కంఠేశ్వర్, నవంబర్ 26: కుటుంబ సర్వే కోసం టోల్ ఫ్రీ నంబర్ 08462-221001ను ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటికి స్టిక్కర్ అతికించకపోయినా, ఎన్యుమరేటర్లు సర్వే చేపట్టకపోయినా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు.

చెక్కుల పంపిణీ

వేల్పూర్, నవంబర్ 26: పచ్చలనడ్కుడలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈదుల్లా లక్ష్మికి రూ.35 వేలు, జాపిరి పెద్దనర్సయ్యకు రూ.18 వేల విలువైన చెక్కులు అందజేశారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, నవంబర్ 26: టీయూ అనుబంధ కళాశాలల పరిధిలోని (సీబీసీఎస్) బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సులకు సంబంధించి ఒకటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన పరీక్షకు 7,748 మంది విద్యార్థులకు 7,147 మంది హాజరు కాగా 601 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 6,564 మందికి 5,989 హాజరు కాగా 572 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను గుర్తించామని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు బదిలీ

వినాయక్‌నగర్, నవంబర్ 26: తెలంగాణలో పోలీసు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఎస్పీలతోపాటు 30 మంది అడిషనల్ ఎస్పీలకు స్థానచలనం కల్పించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో అడిషనల్ డీసీపీ(ఆడ్మిన్)గా పని చేస్తున్న కోటేశ్వర రావును ఎల్‌బీ నగర్ శాంతిభద్రతల అదనపు డీసీపీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నిజామాబాద్ కమిషనరేట్‌లో శాంతిభద్రతల విభాగం తాత్కాలిక అదనపు డీసీపీగా కొనసాగుతున్న బస్వారెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగించారు.

బ్యాలెట్ పేపర్ విధానంపై వ్యాజ్యం కొట్టివేత

కంఠేశ్వర్, నవంబర్ 26: ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ డాక్టర్ కౌల్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టర్ తెలిపారు.

పాఠశాల తనిఖీ

బాల్కొండ, నవంబర్ 26: మండలంలోని చిట్టాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో బట్టు రాజేశ్వర్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

ఎల్‌వోసీ అందజేత

మాక్లూర్, నవంబర్26: మెడవాపు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మాదాపూర్‌కు చెందిన సాదుల లతా ధర్మపురికి రూ.5 లక్షల ఎల్‌వోసీని మంగళవారం బీజేపీ నాయకులు అందజేశారు. నాయకులు రామావత్ సురేశ్‌నాయక్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

మాక్లూర్, నవంబర్ 26: ఇటీవల మెదక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాల పదో విద్యార్థిని వై.ప్రజ్ఞను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ప్రసన్నకుమారి మంగళవారం అభినందించారు. డిసెంబర్ 6 నుంచి 10 వరకు జమ్ముకశ్మీర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

SUPER HIT... నేడే చూడండి

సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టీసి క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ముల్లికార్జున - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
రామకృష్ణ 70 ఎంఎం ఎ/సి - అబిడ్స్ 11.15,6.00
రాజధాని - బిల్‌ముఖీనగర్ 11.30,2.30,6.30,9.30
వెంకటరమణపద్మావతి ఎ/సి - కాచిగూడ 6.15
ఆరాధన - తార్నక 11.00,2.00,6.00,9.00
రంగ 70 ఎ/సి - జేడిమెట్ల 11.00,6.00
మహలక్ష్మీ కాంప్లెక్స్ - కొత్తపేట 11.15,2.30,6.15,9.45
ప్రసాద్ ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 11.55,5.35,10.45
PVR ఆర్.కె - బంజారాహిల్స్ 10.15AM,11.05PM
PVR సంపత్‌లలీమాల్ - పంజాగుట్ట 1.05,11.05PM
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 1.35,7.35,10.40
PVR నెక్సెస్ మాల్ - కూకట్‌పల్లి 10.10,5.05,7.40,11.05
PVR గలేరియా ఎ/సి - పంజాగుట్ట 10.55,4.10
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.10,4.25PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 1.35,7.35,11.00
PVR ప్లజ్ప్లెక్స్ ప్రైమ్ - గచ్చిబౌలి 10.00,4.45,1.15
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 10.05,7.45,11.10
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 10.05,8.00,11.10
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 10.20,10.50PM
సిద్ధార్థ థియేటర్ - కూకట్‌పల్లి 10.40,1.55,4.30,11.20
Cinepolis CCPL - మల్కాజ్‌గిరి 10.00,4.40,1.05
Cinepolis డి.ఎల్.ఎస్ - ఉప్పల్ 10.00,4.45,11.10PM
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్ 4.40,11.10PM
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 10.05,7.35 PM
INOX డి.ఎస్.ఎస్ - మహేశ్వరం 10.05,1.30,7.25,10.50
INOX ఎం.ఎం.మాల్ - కాచిగూడ 3.00,9.50PM
INOX పత్వనెక్సెస్ మాల్ - కూకట్‌పల్లి 1.00,7.15
జెమిని ఎ/సి - వరంగల్ | రా